అటవీ భూముల పరిరక్షణకు చర్యలు

గొలుసు లింక్ ఫెన్సింగే గోడ పెట్టు

మేడ్చల్ జిల్లాలో అటవీ భూ విస్తీర్ణం 8,072 హెక్టార్లు

మేడ్చల్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): అటవీ భూములను అక్రమణల నుంచి రక్షించడానికి గొలుసు లింక్ ఫెన్సింగ్ పనులను అటవీ శాఖ అధికారులు ప్రారంభించనున్నారు. అటవీ భూములు అక్రమణలకు గురువుతున్న క్రమంలో అటవీ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టేలా ప్రణాళికలను రూపొందించారు. అటవీ భూములు అక్రమణలకు గురువుతున్నట్లు ఇటీవల అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ గొలుసు లింక్ ఫెన్సింగ్ చేపట్టేలా నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. అటవీ భూములు పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించింది. 24 శాతం ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచింది. అటవీ భూముల పరిరక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వమే గొలుసు లింక్ ఫెన్సింగ్ పనులను ప్రతిపాదించి నిధులు మంజూరు చేయగా, ప్రస్తుతం ఆ పనులు ప్రారంభించేందుకు అటవీ శాఖ సిద్ధమవుతుంది.

జిల్లాలో 8072.46 హెక్టార్లలో విస్తీర్ణం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 8072.46 హెక్టార్ల అటవీ భూమి విస్తరించి ఉంది. విస్తీర్ణంలో మొత్తం 40 ఫారెస్ట్ బ్లాకులు ఉన్నాయి. 3,660 హెక్టార్ల విస్తీర్ణం ఉన్న 13 బ్లాక్‌లలో నీలగిరి ప్లాంటేషన్స్ ఉండగా, మిగిలిన 2,800 విస్తీర్ణంలో మిస్లేనియస్ ప్లాంటేషన్స్ ఉన్నాయి. అయితే, ఇప్పటికే అటవీ శాఖ భూములలో 17 అర్బన్ పార్కులను ఏర్పాటు చేశారు. అర్బన్ పార్క్‌ల సందర్భంగా అప్పట్లోనే గొలుసు లింక్ ఫెన్సింగులు ఏర్పాటు చేయగా, పార్కులు లేని అటవీ విస్తీర్ణంలో ప్రసుత్తం గొలుసు లింక్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా ఉండేలా చూస్తున్నారు. అయితే, అటవీ భూములలో మరిన్ని అర్బన్ పార్కుల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేయగా, ఇప్పటి వరకు అర్బన్ పార్కుల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టయోటా కార్లపై ప్రత్యేక ఆఫర్లు

సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): టయోటా జెన్యూన్ యాక్సెసరీలపై ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. గతంలో విడుదల చేసిన గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైజర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లిమిటెడ్ ఎడిషన్లపై టయోటా ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయని సేల్స్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కొత్త ఎడిషన్లకు మంచి స్పందన వస్తుందన్నారు. కస్టమర్లకు స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ ద్వారా మెరుగైన సేవ లందించడమే లక్ష్యమని తెలిపారు. అన్ని టయోటా డీలర్ల వద్ద లిమిటెడ్ ఎడిషన్ కోసం బుకింగ్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు www.toyotobharat.com/online-booking సందర్శించాలని తెలిపారు.

'ప్రజావాణి విన్నపాలను సత్వరమే పరిష్కరించండి'

సిటీబ్యూరో, నవంబరు 18(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ఎంఎస్ఎస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజావాణికి వచ్చిన ప్రజల విన్నపాలను డిప్యూటీ మేయర్ స్వీకరించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీదారుని సమస్యను పరిష్కరించడంలో అలసత్వం చేయొద్దని అధికారులను ఆదేశించారు. ఆర్జీదారునికి నిర్దేశించిన కాల వ్యవధిలో పరిష్కారం చేయాలన్నారు. కాగా, జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 117 విన్నపాలు వచ్చాయన్నారు.

పశువైద్య విద్యకు దరఖాస్తులు

రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 18: పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలో ఏడు సీట్ల భర్తీ కొరకు అర్హత గల వారి నుంచి దరఖాస్తు స్వీకరించనున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర తెలిపారు. ఎన్నారై, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద రాజేంద్రనగర్ కళాశాలలో ఎన్నారై, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ఒక్కొక్కటి చొప్పున, కోరుట్ల పశువైద్య కళాశాలలో మూడు ఎన్నారై, రెండు సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ఖాళీలు ఉన్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్ర నగర్‌లోని విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పశు వైద్య విద్య (బీవీఎస్సీ, ఏ, హెచ్)కు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు http;//tsvu.nic.in ను సంప్రదించాలన్నారు. ఈ నెల 25న ధ్రువీకరణ, నిర్ణయించిన కళాశాల ఫీజు డిమాండ్ డ్రాఫ్ట్‌తో హాజరు కావాలని సూచించారు.

25లోపు పాలపిట్ట ఎస్టీపీని సిద్ధం చేయండి

సమీక్షలో జల మండలి ఈడీ మయాంక్ మిట్టల్

సిటీబ్యూరో, నవంబరు 18(నమస్తే తెలంగాణ): జల మండలి ఎస్టీపీ ప్రాజెక్టు ప్యాకేజీ-3లో భాగంగా నిర్మిస్తున్న పాలపిట్ట ఎస్టీపీ (7 ఎంఎల్‌డీల సామర్థ్యం)పై ఈడీ మయాంక్ మిట్టల్ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎస్టీపీ సివిల్ పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. మిగిలిన ఎలక్ట్రో మెకానికల్ పనులను సైతం పూర్తి చేయాలని ఈడీ సూచించారు. పనులు వేగవంతంగా జరిగేందుకు అవసర మైతే కార్మికుల సంఖ్యను రెట్టింపు చేయాలని ఈడీ చెప్పారు. పనులు జరిగేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలన్నారు. ఈ నెల 25వ తేదీలోపు ఎస్టీపీని ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఈడీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎస్టీపీ సీజీఎం పద్మజ, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సీపీఐ 100 వసంతాల ఉత్సవాలను విజయవంతం చేయాలి'

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 18 : సీపీఐ 100 వసంతాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందని, వచ్చే నెల డిసెంబర్‌లో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతి గ్రామంలో ఎర్రజెండాలు ఎగురవేసి పార్టీ చేసిన పోరాటాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు బచ్చనగోని గాలయ్య, శ్రీనివాస్, దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, పందుల యాదగిరి, సంజీవ, సుధాకర్, నర్సింహ, గాలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మహిళల హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య, శ్రామిక మహిళా ఫోరం

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద కటౌట్‌ను ఆవిష్కరిస్తున్న మహిళ నేతలు

హిమాయత్‌నగర్,నవంబర్18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (భారత జాతీయ మహిళా సమాఖ్య) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని ఆరోపించారు. ఈ నెల 23, 24 తేదీల్లో హిమాయత్‌నగర్‌లో జరిగే ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన కటౌట్‌ను సోమవారం వారు హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, తక్షణమే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై రోజు రోజుకు హింస, దాడులు కొనసాగుతున్నాయని వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. ఈ సమావేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నగర అధ్యక్షురాలు పడాల నళిని, నగర కార్యదర్శి సక్రిబాయి, నాయకురాలు ఫమిదా, వాణి, పద్మ, శ్యామల, కమలమ్మ, అంజుమ్, జ్యోతి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన కామిక్ కాన్ - 2024

కామిక్ కాన్ 2024 కార్యక్రమంలో పాల్గొన్న కాస్‌ప్లేయర్లు

మాదాపూర్, నవంబర్ 18: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్రంచైరోల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మారుతి సుజుకి అరేనా కామిక్ కాన్ 2024 అట్టహాసంగా ముగిసింది. ఇందులో ఎపిక్ కాస్ప్లే, గేమింగ్, పాప్ కల్చర్‌తో జరిగిన వేడుకల్లో కామిక్ పుస్తకాలు, మాంగా, యానిమేషన్, సూపర్ హీరో చలన చిత్రాలతో పాటు వినోదభరితమైన కమ్యూనిటీలు ఒకే వేదికపై కొలువుదీరాయి. కామిక్ కాన్ ఫెస్ట్ దేశంలోనే అతి పెద్ద పాప్ కల్చర్ ఈవెంట్‌గా గుర్తింపు పొందడమే కాకుండా నగర కాస్ ప్లే ప్రియులకు థ్రిల్లింగ్ అనుభవాలను అందించింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో 3000 మంది కాస్ ప్లేయర్లు పాల్గొనగా వీటిని చూసేందుకు 40 వేల మంది సందర్శకులు విచ్చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన టోర్నమెంట్లు, ఆటపాటలతో సందర్శకులు ఉత్సాహంగా గడిపారు. చైన్‌సా మ్యాన్, బెసెర్క్ అనిమే, సోలో లెవలింగ్ వంటి యానిమే క్యారెక్టర్లు విశేషంగా ఆకట్టుకోగా వుల్వరైన్, డెడ్‌పూల్, స్పైడర్ మ్యాన్ తదితర ఐకానిక్‌తో అలరించసాగారు. ఇందులో ప్రముఖ హాస్య నటుడు హర్ష్ గుజ్రాల్ విచ్చేసి తన అనుభవాలను పంచుకున్నాడు. హైదరాబాద్ కామిక్ కాన్ అనంతరం, మళ్ళీ ప్రదర్శన ఇవ్వడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కామిక్ కాన్‌తో గత ఐదు నుంచి ఆరేండ్లుగా కలిసి పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు.

హ్యుందాయ్‌తో ఆకట్టుకునే ఆఫర్లు

సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): కొనుగోలుదారులను ఆకట్టుకునే ఆఫర్లతో హ్యుందాయ్ వినూత్న ప్రచార కార్యక్రమాలను నగరంలో చేపట్టింది. ఉప్పల్, గాంధీ నగర్, మణికొండ ప్రాంతాల్లో చేపట్టిన కార్ల డీలర్ సంస్థ కున్ యునైటెడ్‌తో కలిసి క్యాంపెయిన్ నిర్వహించింది. కార్ల కొనుగోలుదారులకు హ్యుందాయ్ ఇస్తున్న ఆఫర్లు, డిస్కౌంట్లు, సేవలపై అవగాహన కల్పిస్తూనే, వారంటీ, ఇన్సూరెన్స్, కారు ఇంటీరియర్, మరమ్మతులపై రాయితీలను ప్రకటించింది. కాగా, ముషీరాబాద్ పరిధిలో సోమవారం జరిగిన మెగా కార్యక్రమాన్ని బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహా ప్రారంభించినట్లుగా కున్ సర్వీసెస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బ్రహ్మం తెలిపారు.

జోయ్ అలుక్కాస్ ఆటో బయోగ్రఫీ 'స్ప్రెడింగ్ జోయ్' అరబిక్ ఎడిషన్ విడుదల సమయంలో హాజరైన యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) ఎకానమీ శాఖ సహాయ మంత్రి, సహ జోయ్ అలుక్కాస్ హెచ్ఈ డాక్టర్ థానీ బిన్ అహ్మద్ అల్ జాయెదీ, దుబాయ్ కన్సూల్ జనరల్ ఆఫ్ ఇండియా సతీశ్ కుమార్, కన్సూల్ జనరల్ ఆఫ్ ద యునైటెడ్ స్టేట్స్, దుబాయ్ రాబర్ట్ రైన్స్, దుబాయ్ ల్యాంబ్ విభాగం డైరెక్టర్ జనరల్, ఇంజనీర్ మర్వాన్ బిన్ ఘలితా, దుబాయ్ జ్యూవలరీ గ్రూప్ చైర్మన్ తాహిద్ అబ్దుల్లా, నేషనల్ బ్యాంక్ ఆఫ్ ఫుజైరా (ఎన్బీఎఫ్) సీఈఓలు అదనాన్ అన్వర్‌లు

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. నవంబర్ 27న వంటావార్పు

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల జేఏసీ నిర్ణయం

డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 18: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఫ్ఏయాకు కేటాయించడాన్ని నిరసిస్తూ 60 రోజులుగా యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన, ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిరసన కార్యక్రమాలను మరింత తీవ్రతరం చేయనున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 27న 'వంటా వార్పు' కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు జేఏసీ చైర్మన్ ప్రొ.పల్లవీ కాట్బే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్ ప్రకటించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, లక్షలాది మంది పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవిష్యత్తును దెబ్బతీసేలా ప్రభుత్వ నిర్ణయం ఉందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు, మేధావులు స్థలం కేటాయింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఉద్యోగుల జేఏసీ నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా నవంబర్ 27న వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.వేణుగోపాల్‌రెడ్డి, డా.రజినీ, డా.కే.కృష్ణారెడ్డి, ప్రొ.పుష్పా చక్రపాణి, ప్రొ.ఆనంద్ పవార్, డా. అంబేద్కర్, డా.రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల విలీన హామీని నిలబెట్టుకోవాలి

ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న

హయత్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట నినదిస్తున్న జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, తదితరులు

హయత్‌నగర్, నవంబర్ 18: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర నాయకత్వం డిపోల పర్యటనలో భాగంగా హయత్‌నగర్ 1, 2 డిపోల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి పలువురు ఉద్యోగులు హాజరయ్యారు. ఆమనగంటి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈదురు వెంకన్న మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి 2021 వేతన సవరణ 30 శాతం వెంటనే అమలు చేయాలని, 2017 వేతన సవరణ బకాయిలు, అలవెన్సులు పెంచి చెల్లించాలన్నారు. వెల్ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని సంపూర్ణ ఉద్యోగ భద్రత ప్రకటించి టికెట్ తీసుకునే బాధ్యతను ప్రయాణికుడినే చేయాలన్నారు. జేఏసీ కో కన్వీనర్ కత్తుల యాదయ్య మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ అధిక పనిభారాలు కార్మికులపై మోపి ఉద్యోగులకు లీవులు ఇవ్వకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. డిసెంబర్ 5న ఛలో హైదరాబాద్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కో కన్వీనర్ సు ద్దాల సురేశ్, సత్యపాల్, రాంరెడ్డి, మల్లేశ్, అచ్చాలు, కెకె మూర్తి, పీఎస్ రావు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్, నవంబర్ 18: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ విభాగంలో పనిచేసే రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించి వారిని పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ హెచ్ఎం స్కీం కింద 17 ఏండ్లుగా చాలీ చాలని వేతనాలు తీసుకుంటూ రెండో ఏఎన్ఎంలు పలు రకాల సేవలు అందిస్తున్నారని తెలిపారు. రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. నిత్యం పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేవలందిస్తున్న వీరికి చట్ట పరంగా అందాల్సిన ఫలాలు దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, అధ్యక్షురాలు జక్కుల పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల, నాయకులు రాజే శ్వరి, తన్వీర్ సుల్తానా, వనజ, పద్మ, బాల నాగమ్మ, రజిత అలేఖ్య, జయమ్మ, సంధ్య పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, జయేశ్ రంజన్

హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో విప్లవాత్మక మార్పులు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

కొండాపూర్, నవంబర్ 18: ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో కృత్రిమ మేధ (ఏఐ) ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రహేజా మైండ్‌స్పేస్ ఐటీ పార్కులోని వెస్టిన్ హోటల్‌లో బయో ఏషియా -2025లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్‌కేర్ రంగంలో ఏఐ ప్రాధాన్యత సదస్సుకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కృత్రిమ మేధ ఈ కాలపు అత్యంత ముఖ్యమైన సాంకేతిక పురోగతని, పరిశ్రమలు, ప్రభుత్వం, సమాజంలో లోతైన మార్పులను తీసుకువస్తుందన్నారు. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఔషధాల ఆవిష్కరణలో, రోగ నిర్ధారణలో, రోగి సంరక్షణ, భద్రతను మెరుగుపరచడంలో ఏఐ పురోగతి సాధిస్తుందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. అనంతరం, తెలంగాణ లైఫ్ సైన్సెస్ లోగో, ఏఐ ఇన్‌ఫ్యూజ్డ్ ఫార్మా ఆర్ అండ్ డీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

టర్కీ టోర్నీకి తొమ్మిది మంది క్రీడాకారులు

తెలంగాణ ఫుట్‌బాల్, స్కేటింగ్ క్రీడాకారులతో ఎఫ్ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరి, చీఫ్ కోచ్ ఎంఏ ఖదీర్

నేరేడ్‌మెట్, నవంబర్ 18: టర్కీ వేదికగా నవంబర్ 21 నుంచి 26వ తేదీ వరకు 15వ ఫుట్‌బాల్, స్కేటింగ్ ప్రపంచ కప్ జరగనున్నట్లు ఎఫ్ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరి, చీఫ్ కోచ్ ఎంఏ ఖదీర్ తెలిపారు. యాప్రాల్‌లోని ఫుట్‌బాల్ స్కేటింగ్ అకాడమిలో సోమవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ నుంచి వివిధ విభాగాల్లో తొమ్మిది మంది ఫుట్‌బాల్ స్కేటింగ్ క్రీడాకారులు ఎంపిక కాగా, క్రీడాకారులతో పాటు కోచ్‌లు సోమవారం టర్కీకి బయల్దేరుతున్నట్లు ఆయన చెప్పారు. ఫుట్‌బాల్ స్కేటింగ్ టోర్నమెంట్‌కు తెలంగాణ సీనియర్ క్రీడాకారులు మహ్మద్ అబ్దుల్ రకీబ్ ఉద్దీన్ (తెలంగాణ), మహ్మద్ నసీరుద్దీన్ (ఆంధ్రప్రదేశ్), తోట భార్గవ రాకేశ్ (తెలంగాణ), బెత్వాలా మహ్మద్ హంజా షోబోద్దీన్ (గుజరాత్) మీల్ రోమి (హర్యాన), పరేఖ్ ఖుష్బూ సురేశ్ కుమార్ (గుజరాత్), సల్లానా (గుజరాత్), జూనియర్ క్రీడాకారులు మహమ్మద్ అబ్దుల్ రహమాన్ (తెలంగాణ), మహ్మద్ అలీ అక్బర్ (తెలంగాణ), భూసా అనంత లక్ష్మి గంగాప్రసాద్ (తెలంగాణ), అదిత్య అవినాష్ మోగ్రే (మహారాష్ట్ర), మిత్ర ఆరాష్ (తెలంగాణ), కొర్తల్వార్ అన్వి (తెలంగాణ) మహా మరియం (తెలంగాణ) పూసర్ల అభిజిత్ (ఆంధ్రప్రదేశ్) రోహిత్ తవాడే (మహారాష్ట్ర), వివేక్ పటేల్ (గుజరాత్) తెలంగాణ నుంచి తొమ్మిది మంది ఫుట్‌బాల్ స్కేటింగ్ క్రీడాకారులు వెళ్లనున్నారని కోచ్ ఎంఏ ఖదీర్ తెలిపారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్ల విస్మరణ దుర్మార్గం

కేంద్ర ప్రభుత్వంపై అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం నిప్పులు

మహా ధర్నాలో మాట్లాడుతున్న అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు

చిక్కడపల్లి, నవంబర్ 18: దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులను వృద్ధిలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గం అని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లోఉన్న రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ రిటైరీస్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రిటైరీస్ ఫెడరేషన్ వేలాది మంది రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగులతో మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ, పదవీ విరమణ తరువాత బ్యాంకు ఉద్యోగులకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించడం కోసం అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం అనేక పోరాటాలు చేసి పెన్షన్ సౌకర్యం, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సాధించినదని తెలిపారు. పెన్షన్ ముఖ్యమైన సామాజిక భద్రతా ప్రమాణాలలో ఒకటని, మూడు దశాబ్దాలుగా బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ జరగకపోవడం దారుణమన్నారు. అనంతరం, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ రిటైరీస్ ఆర్గనైజేషన్స్ జాతీయ అధ్యక్షుడు దేశ్‌పాండే మాట్లాడారు. తెలంగాణ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణ, ఏ.రాజేందర్ ప్రసాద్, ఎం.ఎన్. రావు, ఆర్.లక్ష్మణ్ రావు, ఎన్ఎస్ఎన్ రెడ్డి, కృష్ణమూర్తి, బీవీ నారాయణ రావు, జానకి రామ్ పాల్గొన్నారు

క్రీడల్లో గెలుపోటములు సహజం

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ గృహాల విద్యార్థులకు డివిజన్ వారీగా జిల్లా స్థాయిలో నవంబర్ 8 నుంచి 16 వరకు జరిగిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో క